# భక్తి ప్రాపక ప్రదర్శనలు

-భమిడిపాటి సోమయాజి

విజయవాణి, సత్యవాణి సోదరీమణులు. విజయవాణి భర్త హైదరాబాద్‌లో ఉద్యోగం చేసి పదవీ విరమణ చేసాడు. సత్యవాణి భర్త శ్రీకాకుళంలో ఉద్యోగం చేస్తున్నాడు.

ఇంకా ఓ సంవత్సరం సర్వీసుంది. విజయవాణి, సత్యవాణి చాలా అఖండులు. ఏ సమస్యనైనా సులువుగా తీర్చగలరు. విజయవాణి భర్త చేసిన అవకతవకలకి పెన్షన్ ఆగిపోయింది.

విజయవాణి కొంచెం కూడా కంగారుపడలేదు. రోజుకి సుమారుగా ఓ ఎనిమిది వందలు సంపాదించే పథకం తయారుచేసింది. భర్తకి ఓ ఆర్నెల్లు అన్నీ నేర్పించింది. సోమవారం శివుడి వేషం వేయించి నాట్యం చేయించేది. ఓసారి నాట్యం చేసేటప్పుడు తన భర్త చేతిలోని త్రిశూలం గోడకి కొట్టుకుని పెద్ద శబ్దమయింది. శివుడి వేషంలో వున్న విజయవాణి భర్త కంగారుపడ్డాడు.

విజయవాణి చెప్పింది "ఇటువంటప్పుడే ధైర్యంగా ఉండాలి. అసలు శివుడిలాగా బోళాబోళీగా ఉండకండి" ఇంతలో పక్కవాటాలో వున్న వాళ్లు ఆ శబ్దం ఏమిటో చూద్దామని వచ్చారు.

"మావారికి శివుడు పూనాడు. ఆ శబ్దం విని వచ్చారనుకుంటాను. అది ఢమరుక శబ్దం" అన్నీ ముచ్చటగా చెప్పేసి వాళ్లని పంపించేసింది.

పక్క వాటాలోని అయ్యంగారు ఈసారి ఎప్పుడైనా శివుడు పూనితే శీఘ్రంగా ఆయన్ని పిలవమన్నాడు. 'ఎప్పుడో ఎందుకు? వచ్చే సోమవారమే పూన్తాడు' అని మనసులో అనుకుని "తప్పకుండా పిలుస్తాను అయ్యారన్నా" అంది విజయ.

అయ్యారుగారు వెళ్లిపోయి విజయవాణి భర్తకి శివుడు పూనాడన్న విషయం తనలోనే పూడ్చిపెట్టకుండా పదిమందికీ చెప్పాడు. విన్నవాళ్లు దేవుడు పూనడం పెద్ద అదృష్టం అన్నారు.

***

ఏ వారం దేవుడికి ఇష్టమో తెలుసుకున్న విజయవాణి తన భర్తని మంగళవారం పాములా పాకించింది.

"ఇలా పాకడం కష్టంగా ఉంది. ఎప్పుడో చిన్నప్పుడు చేసిన విన్యాసం. షష్టిపూర్తి అయిన తరవాత చేయాలంటే చాలా కష్టంగా ఉంది" అన్నాడతను.

"పెన్షన్ ఆగిపోయింది. శాస్త్రప్రకారం కుమారస్వామికి గురువారం ప్రీతికరమైన రోజు. చాలామంది మంగళవారం కుమారస్వామికి ప్రీతి అని చెబుతారు. ప్రస్తుతం ప్రజారాజ్యం నడుస్తోంది. అందుకని ప్రజల నమ్మకానికి వ్యతిరేకంగా ఏ పని చేయకూడదు. చేసినా చెల్లుబడికాదు. అందుకని నిన్నునే మీకు శివుడు పూనినా మరుసటిరోజైనా ఈ మంగళవారమే పాములా పాకిస్తున్నాను. సుబ్రహ్మణ్యస్వామి పాముకి ప్రతిరూపమే."

"ఎవరు చెప్పారు?"

"ఎవరు చెప్పడమేమిటి? నేనే చెబుతున్నాను. లక్షణంగా, ముచ్చటగా నేలపై పాకండి. పాయసం వండి పెడతాను" అంది విజయ.

"పాకితే పాయసం, అడుగులేస్తే అరిసెలు అన్న మాటలు నాకు జ్ఞానం రానప్పుడు విన్నాను."

"జ్ఞానం రానప్పుడు అంటున్నారు. ఇప్పుడు మీకు జ్ఞానం వచ్చిందనుకుంటున్నారా? కొంత మందికి వయస్సు వస్తుందిగానీ జ్ఞానం ఎప్పటికీ రాదు. అది లేకనేకదా అయిదువేలు లంచం తీసుకోమన్న నా మాటలు లెక్క చేయకుండా పదివేలు అడిగి పట్టుబడ్డారు. తరువాత పెన్షన్ ఆగిపోయి ఇలా అన్నిరకాల వేషాలు వేయాల్సి వస్తోంది."

'ఇన్ని మాటలు పడేకంటే కష్టమో, నిష్ఠూరమో పాకడమే శ్రేష్ఠం' అనుకున్నాడు విజయవాణి భర్త.

ఆ పాకడంలో అయ్యారుగారికి వీళ్ల వాటాకీ మధ్యనున్న తలుపుకి తలకాయ తగిలింది. మళ్లీ ధనమని చప్పుడు. మళ్లీ అయ్యారు ప్రత్యక్షం.

పాకుతున్న విజయవాణి భర్తను చూసి పులకించిపోయిన అయ్యారుగారు "అయ్యో నిన్న శివుడు, ఈరోజు శివకుమారుడు పూనడం రొంబ విశేషం" అంటూ చాలామందికి చెప్పాడు ఈ విషయం. అందరూ ఆశ్చర్యపోయారు. ఏ ఏ వారం ఏ ఏ దేవుడు ప్రసిద్ధో తెలుసుకున్న జనం విజయ ఇంటికి కొబ్బరికాయలు, అరటిపళ్లు, అగరవత్తులు తీసుకుని వచ్చేవారు. ఏ దేవుడికి ఆ దేవుడి పేర హుండీలు ఏర్పాటు చేసారు.

***

కొన్నాళ్ల తరువాత సత్యవాణి తన అక్కకి శ్రీకాకుళం నుంచి ఫోన్ చేసింది.

"మా ఆయనకి కూడా పెన్షన్ ఆగిపోయిందే. ఇల్లు గడవడం కష్టంగా ఉంది" అని చెప్పింది.

"వెర్రిమొహమా! కంగారుపడకు. మీ ఆయనా నువ్వూ ఓసారి హైదరాబాద్‌కు రండి. తెలివి వుంటే ఎలాగైనా బ్రతకొచ్చు. మీ బావని అడ్డు పెట్టుకుని బోలెడు సంపాదిస్తున్నాను. పొద్దున్న ఓ రెండు మూడు గంటలు కష్టపడితే చాలు."

"అంటే పార్ట్‌టైం జాబా?"

"ఇక్కడికి వస్తే పార్ట్‌టైమా, ఫుల్‌టైమా? అసలు జాబ్ అవునా కాదా అన్న విషయాలన్నీ అర్థమవుతాయి" అంది విజయవాణి.

***

సత్యవాణి తన భర్తతో హైదరాబాద్‌కు వచ్చి అన్ని విషయాలు అర్థం చేసుకుంది.

భర్తతో చెప్పింది "మా బావలా మీరు కూడా పాకండి"

"నేను ఛస్తే అలా పాకలేను. పాకను" అన్నాడు సత్యవాణి భర్త.

"అరవై ఏళ్లవరకు ఉద్యోగం చేసిన మా బావగారే సహనంగా పాకుతుంటే యాభై ఎనిమిదేళ్లవరకు ఉద్యోగం చేసిన మీరు పాకలేనంటే నాకు చాలా సిగ్గుచేటు. మా అక్కయ్య ముందు మొహం ఎత్తుకుని ఎలా తిరగగలుగుతాను చెప్పండి" అంది బాధగా. సత్యవాణి భర్త కూడా పాములా పాకడం మొదలుపెట్టాడు. పాలు కలిసొస్తాయని అక్కాచెల్లెళ్లిద్దరూ ఒకేసారి పాయసం వండి వాళ్లు తినగా మిగిలింది భర్తలచేత నాకించారు.

"మేమిలా నాకలేం" అన్నారు వాళ్లిద్దరూ.

"పాములు నాకుతాయిగానీ తినవు. అసలు నాకలేనివాళ్లు ఎందుకు పాకారు?'' అని వాళ్లంతట వాళ్లే పాకినట్లు కేకలేసారు అక్కాచెల్లెళ్లు.

★★★

ఆ రోజు సోమవారమని మరచిపోయిన విజయవాణి భర్త విష్ణువు వేషం వేసుకుని ముందు గదిలో కూర్చున్నాడు. పెరట్లో మొక్కలకి నీళ్లు పోస్తున్న అయ్యొరుగారు ఆ రూపం చూసి "ఈరోజు సోమవారం కదా. శివుడు కదా పూనవలసింది'' అని కొంచెం గట్టిగానే అన్నాడు. అప్పటికే కొంతమంది భక్తులు కూడా వచ్చేసారు. హడావుడి మొదలైంది. తప్పు గ్రహించిన సత్యవాణి లోపలి గదిలోంచి "శివాయ విష్ణు రూపాయ, విష్ణురూపాయ శివయే'' అని గట్టిగా అరిచింది.

ఎవరు అరిచారో అర్థంకాని భక్తులకి "ఎవరో కాదు అరిచింది అజ్ఞాత సత్యవాణి'' అని చెప్పింది విజయవాణి నిజం చెప్పినా అర్థం చేసుకోలేని మూఢ భక్తులకి.

"శివుడికి విష్ణువుకు తేడాలేదని అంతకుముందే ఆకాశవాణి చెప్పింది. ఇప్పుడు అజ్ఞాత సత్యవాణి కొత్తగా ఏం చెప్పనక్కర్లేదు'' అన్నారు కొంతమంది. ఆ రోజు కార్యక్రమం అయిపోయిన తరువాత భర్తకి ఓ టైమ్‌టేబుల్ రాసిచ్చింది విజయవాణి. జిరాక్స్ కాపీ సత్యవాణి తీసుకుంది.

★★★

సత్యవాణి తన భర్తను తీసుకుని శ్రీకాకుళం వెళ్లి అక్కడ ఈ పూనక భక్తి ప్రదర్శనలు మొదలుపెట్టింది. అక్కడ కూడా భక్తులు బాగానే వస్తున్నారు.

"మన దేశంలో భక్తికీ, తద్వారా భుక్తికీ లోటు లేదు'' అనుకుంది సత్యవాణి.

ఈ ప్రదర్శనలు చూసిన ఓ భక్తుడు "హైదరాబాద్‌లో మా చుట్టాలింటి దగ్గర్లో ఇటువంటి కార్యక్రమాలే జరుగుతుంటాయి. ఆ ఇంటాయనకి సుబ్రహ్మణ్యస్వామి పూనినప్పుడు ఈయనకంటే బాగా పాకుతాడు'' అన్నాడు.

ఈమాటలు విన్న సత్యవాణి 'మా ఆయనకి పాకడం కొత్తకదా. ఇంకొంచెం సాధన చేస్తే మా బావగార్ని మించి పాకుతాడు. నాచేత శభాష్ అనిపించుకుంటాడు' అనుకుంది స్వగతంగా.

"పవమాన సుతుడు పట్టు పాదార విందములకు... నిత్య శుభ మంగళం'' అని మంగళ హారతి పాడేసారు ఆ రోజుకి.

★

